

చీనీ టన్ను రూ.24,310

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,310 పలికాయి.



టమాట కిలో రూ.11

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.11 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.7°/16.2°

జిల్లా పరిధిలో శనివారం చలి వాతావరణం నెలకొంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సమన్వయంతో పని చేద్దాం

- జెడ్పీ నూతన సీఈఓకి చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచన



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ)గా నియమితులైన రాజోలి రామచంద్రారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అంతకు ముందు నూతన సీఈఓకు జెడ్పీ ఉద్యోగులు స్వాగతం పలికారు. డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, సిబ్బంది బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఈఓ నేపథ్యం ఇలా..

వైఎస్సార్ జిల్లా ముద్దనూరు మండలానికి చెందిన రాజోలి రామచంద్రారెడ్డి 1996లో గ్రూప్–2లో ప్రతిభ కనబరిచి ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 1996లో తొండూరు ఈఓపీఆర్‌డీగా నియమితులయ్యారు. ఆ తరువాత ఎంపీడీఓగా అదే జిల్లా చాపాడు, ప్రొద్దుటూరు, రాజుపాళెం, చింతకొమ్మదిన్నె మండలాల్లో పని చేశారు. 2019 నుంచి 2023 వరకు కడపలో డ్వామా ఏపీడీగా పని చేశారు. అనంతరం నంద్యాల జిల్లా డ్వామా పీడీగా నియమితులయ్యారు. అక్కడి నుంచి అనంతపురం ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓగా బదిలీపై వచ్చారు.

‘పోరుబాట’ సక్సెస్‌తో జోష్



ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ‘పోరుబాట’ విజయవంతమైంది. నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టిన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేసినందుకు జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కృతజ్ఞతలు తెలిపారు. పోరుబాట సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో జోష్ వచ్చిందన్నారు. ఇక మీదట కూడా రెట్టించిన ఉత్సాహంతో ప్రజలపక్షాన ఉద్యమాలు చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

రేషన్ దుకాణాలకు ‘గాలి ప్యాకెట్లు’



ఖాళీ కందిబేడల ప్యాకెట్‌ను చూపుతున్న డీఎం రమేష్ రెడ్డి

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వంలో ఇదో వింత. రేషన్ దుకాణాలకు కంది బేడల ప్యాకెట్లను సరఫరా చేయాల్సి ఉండగా, కేవలం కవర్‌లో గాలిని నింపి పంపించారు. మండలంలోని చిన్నపొలమడ వద్ద గల రైస్ గోడౌన్‌ను శనివారం పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొందరు డీలర్లు తమకు కందిబేడల స్థానంలో గాలితో నిండిన ప్యాకెట్లు సరఫరా చేశారని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. గోడౌన్ అధికారులకు చెబితే ‘సర్దుకుపోండి’ అంటూ ఉచిత సలహా ఇచ్చారని వాపోయారు. దీంతో గోడౌన్ సిబ్బందిపై డీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. గోడౌన్‌లో తూకాల్లో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బియ్యం బస్తాలను గోడౌన్ నుంచి తీసుకెళ్లేటప్పుడు తప్పనిసరిగా తూకాలు వేసుకోవాలని డీలర్లకు సూచించారు.

ప్రయాణికురాలి బంగారు, నగదు అపహరణ

గుత్తి: ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఓ ప్రయాణికురాలి ఆభరణాలు, నగదును దొంగలు అపహరించారు. వివరాలు..పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన భూమిక గుంతకల్లు బస్సు ఎక్కేందుకు గుత్తి బస్టాండులో వేచి ఉంది. ఇంతలో గుర్తు తెలియనివ్యక్తులు ఆమె బ్యాగులో ఉన్న జత బంగారు కమ్మలు, రూ.9 వేల నగదు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐలు నాగమాణిక్యం, ఆజాద్, సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని విచారించారు.

అదిరే.. అదిరే..

కాలం మారింది. అందుకు తగ్గట్టుగా పద్ధతులూ మారిపోయాయి. కొత్తకొత్త సంప్రదాయాలు పుట్టుకొచ్చాయి. ఇద్దరి మనసులను కలిపి ఒక్కటి చేసే వివాహమనే ఘట్టంలోనూ నూతన ఒరవడి ఒకటి పురుడుపోసుకుంది. అదే ప్రీ వెడ్డింగ్ షూట్. రూ. లక్షలు ఖర్చవుతున్నా యువత ఎక్కడా తగ్గడం లేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి కూడా సై అంటున్నారు. పిల్లలకు అడ్డు చెప్పలేక తల్లిదండ్రులు కూడా మిన్నకుండిపోతున్నారు.



పెళ్లి పుస్తకం.. కొత్త సంప్రదాయం!

- ప్రీ వెడ్డింగ్ షూట్ కొత్త పుంతలు
- నిశ్చితార్థం నుంచే లొకేషన్‌ల కోసం వెతుకులాట
- రూ.3 లక్షలైనా తగ్గేదే లేదంటున్న వైనం
- పిల్లల ఇష్టాయిష్టాలు కాదనలేకపోతున్న తల్లిదండ్రులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రీ వెడ్డింగ్ షూట్ కొత్త పుంతలు తొక్కుతోంది. ఇటీవల గ్రామీణ ప్రాంతాలకూ ఈ సంస్కృతి వ్యాపించింది. ఒకప్పుడు పెళ్లికి నాలుగు లక్షల రూపాయలైందంటేనే అంతా ఆశ్చర్యపోయేయారు. కానీ, నేడు ప్రీ వెడ్డింగ్ షూట్‌కే రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. పెళ్లికి ముందు ఏకంగా నాలుగైదు రోజుల పాటు పర్యాటక ప్రాంతాల్లోనే గడుపుతున్నారు. సంప్రదాయాలు అడ్డొస్తున్నా పిల్లల ఇష్టాయిష్టాలను కాదనలేక తల్లిదండ్రులు ఓకే చెబుతున్నారు.

నిశ్చితార్థం నుంచే..

గతంలో పెళ్లయ్యాక హనీమూన్‌కు ఎక్కడికెళ్లాలి అంటూ అందరితో ఆరా తీసేవారు. ఇప్పుడు నిశ్చితార్థం జరిగిన రోజు నుంచే ప్రీవెడ్డింగ్ షూట్‌కు అనువైన ప్రాంతాలను వెతుకుతుండటం గమనార్హం. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు బెంగళూరుకు దగ్గరగా ఉండటంతో కర్ణాటకలోని పర్యాటక ప్రదేశాలనూ ఇంటర్నెట్‌లో చూస్తున్నారు.

గండికోటకు క్యూ..

ఎక్కువ జంటలు చారిత్రక కట్టడాలను ప్రీవెడ్డింగ్ షూట్‌కు ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో చాలా మందికి నచ్చుతున్న వేదికల్లో గండికోట మొదటి వరుసలో ఉంటోంది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోట రాజసానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇటీవల ఆ ప్రాంతానికి ప్రీ వెడ్డింగ్ షూట్‌కు వెళ్తున్న జంటలు ఎక్కువయ్యాయి. ఆ తర్వాత కర్ణాటకలోని నందిహిల్స్, కూర్గ్, మైసూరు, గోవాతో పాటు బాగా డబ్బున్న వారైతే జైపూర్‌కు వెళుతున్నారు.

రెండు నుంచి మూడు లక్షలు..

ఒకేరోజులో అంటే ప్రీ వెడ్డింగ్ షూట్ అయ్యేది కాదు. రెండు, మూడు రోజులు అక్కడే ఉండాల్సి వస్తోంది. ప్రత్యేకంగా ఓ కెమెరా మెన్ లేదా ఒక ఫొటోగ్రాఫర్‌ను వెంట తీసుకెళ్లాలి. ఈ క్రమంలో కెమెరామెన్, ఫొటోగ్రాఫర్లకే రూ.1.50 లక్షల వరకూ ముట్టజెబుతున్నారు. బస, ఆహారం, దుస్తుల కొనుగోలు తదితర వాటికి మరో లక్ష రూపాయల పైనే ఖర్చవుతోంది. ఈ మూడు రోజుల ప్రక్రియను ఎడిట్ చేసి పెళ్లినాడు ప్రదర్శిస్తున్నారు. పెళ్లి ఖర్చులకు ఇదంతా అదనం కావడం గమనార్హం.



జిల్లాలో పెళ్లిళ్ల వివరాలు..

ఏటా జరుగుతున్న పెళ్లిళ్లు
30,000 వరకు

ప్రీ వెడ్డింగ్ షూట్‌కు వెళుతున్న జంటలు
6,000 పైనే

సగటున ప్రీవెడ్డింగ్ షూట్ వ్యయం
రూ. 2,00,000

రవాణా, దుస్తులు తదితరాల ఖర్చు
రూ. 50 వేల నుంచి లక్ష

సీజన్‌లో ఫుల్ బిజీ



ప్రీ వెడ్డింగ్ షూట్ సంస్కృతి బాగా పెరిగింది. రెండు నుంచి మూడు రోజులు జంట వెంటే ఉండి ఫొటోలు తీస్తాం. ఎడిటింగ్, ఆల్బం అన్నీ కలిపి కనిష్టంగా రూ.60 వేలు తీసుకుంటాం. ఎక్కువమంది బెంగళూరులోని రిసార్ట్స్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌ల కోసం చాలా బిజీగా ఉంటాం.
–వాల్మీకి బాసంతి, ఫొటోగ్రాఫర్/కాన్సెప్ట్ ఆర్టిస్ట్

ఒకరినొకరు తెలుసుకోవచ్చు..



ఒకరి మనసు మరొకరు తెలుసుకునేందుకు ప్రీ వెడ్డింగ్ షూట్ ఎంతో ఉపయోగపడుతుంది. మా స్నేహితులు, బంధువులు ఎంతో ఆడంబరంగా ఈ వేడుక జరుపుకున్నారు. సమయాభావం వల్ల మేం మిస్ అయ్యాం.
– పాండ్రే వైష్ణవి, బ్యాంకు ఉద్యోగి

మార్పును అంగీకరించక తప్పదు



ఇటీవల వివాహ తంతులో ప్రవేశించిన పాశ్చాత్య విషయాలు శాస్త్ర విరుద్ధమైనప్పటికీ అంగీకరించక తప్పడం లేదు. మారుతున్న కాలంలో అన్ని పద్ధతులతో పాటు వివాహ విషయాల్లో కూడా చాలా వరకు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జాగ్రత్తలు తీసుకుంటే ప్రీ వెడ్డింగ్ షూట్‌తో ఇబ్బంది ఉండదు.
– బాలాజీ శర్మ, వేద పండితులు, అనంతపురం

ఫైనాన్స్ కంపెనీలో భారీగా బంగారం మాయం

- మేనేజర్‌పై అనుమానం

ఉరవకొండ: పట్టణంలోని ఓ ప్రముఖ గోల్డ్ లోన్ ఫైనాన్స్ కంపెనీలో భారీగా బంగారం మాయమవడం చర్చనీయాంశమైంది. తాకట్టు పెట్టిన బంగారు నగలు కనిపించకపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, సదరు ఫైనాన్స్ కంపెనీ బ్రాంచి మేనేజరే నగలను కాజేశాడనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సదరు గోల్డ్ లోన్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ప్రధాన కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి ఆడిటర్లు ఉరవకొండకు చేరుకుని ఆరా తీశారు. దాదాపు కేజీ పైగా బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. శనివారం ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది విచారణ చేపట్టారు. ఫైనాన్స్ కంపెనీ ఆడిటర్ల నుంచి వివరాలు సేకరించారు. సదరు ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ మేనేజర్ తన సొంత అవసరాలకు బంగారు ఆభరణాలను మరో చోట తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గోమాతకు సీమంతం



గోమాతకు సీమంతం చేస్తున్న వెంగమనాయుడు దంపతులు

బత్తలపల్లి: గోమాతను హిందువులు పవిత్రంగా పూజిస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం బత్తలపల్లిలో చెరుకూరి వెంగమనాయుడు దంపతులు(పోస్టల్ నాయుడు) తమ ఇంట పెంచుకుంటున్న గోమాతకు సీమంతం నిర్వహించారు. ఏడు నెలల తొలిచూరి గర్భంతో ఉన్న గోమాతను ఇంటి ఆడపడుచుగా భావించి ఘనంగా సీమంతం చేశారు. బంధువులు, స్నేహితుల సమక్షంలో వేదపండితులు మంజునాథ శర్మచే పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు నిర్వహించే విధంగానే గోమాతకు కూడా పసుపు, కుంకుమ, పుష్పాలతో పాటు నూతన దుస్తులను సమర్పించారు. అతిథులకు అన్నదానం చేశారు.

హిందూపురంలో వడ్డీ జలగలు

- హిందూపురంలోని ముక్కిడిపేటకు చెందిన అజ్మత్ కూరగాయల వ్యాపారి. ఇతను ఓ వ్యక్తి నుంచి రూ.10వేలు డైలీ ఫైనాన్స్ కింద తీసుకున్నాడు. చేతికి వచ్చింది రూ.7,500 మాత్రమే. రోజుకు వంద రూపాయల చొప్పున వంద రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఆ లెక్కన రూ.10వేలు చెల్లించినట్లు. వడ్డీ రూపంలో రూ.2,500 ఫైనాన్షియర్‌కు అందినట్లు.
- పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న ఓ బేకరీ నిర్వాహకుడు వడ్డీ వ్యాపారి వద్ద రూ.10వేలు తీసుకున్నాడు. ఇది 50 రోజుల్లో పూర్తయ్యేలా రోజుకు రూ.200 కంతుతో పాటు రూ.20 వడ్డీ కింద చెల్లిస్తున్నాడు.
- మరో కూరగాయల వ్యాపారి నారాయణ రోజువారీ వడ్డీ కింద రూ.2వేలు తీసుకున్నాడు. వీధుల్లో బండిపై కూరగాయలు అమ్మడం సాయంత్రం రూ.2000 అసలుతో పాటు అందుకు వడ్డీ రూ.200 చెల్లిస్తున్నాడు. మళ్లీ ఎప్పుడు అవసరమైనా రోజు వారీ కింద వడ్డీకి తెచ్చుకుంటున్నాడు.
- మేళాపురానికి చెందిన చాంద్ అత్యవసర నిమిత్తం తన ద్విచక్రవాహనాన్ని ఓ వ్యక్తి వద్ద కుదువ (తాకట్టు) పెట్టి రూ.20వేలు తెచ్చుకున్నాడు. నెల రోజుల తర్వాత రూ.1800 వడ్డీతో పాటు అసలు కట్టించుకున్నాకే బైక్‌ను విడిపించుకున్నాడు.



- జోరుగా డైలీ ఫైనాన్స్
- అధిక వడ్డీ వసూలు
- సామాన్యులు విలవిల

హిందూపురం అర్బన్: అవసరాలకు అప్పులు ఇచ్చే వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తూ రుణగ్రహీతల పాలిట జలగల్లా మారుతున్నారు. టీ కేఫ్‌లు, హోటళ్లు, చిరుతిండ్ల దుకాణాలు, కూరగాయలు, పండ్ల విక్రయాలు, తదితర వ్యాపారాలతో ఎంతోమంది స్వయం ఉపాధి పొందుతున్నారు. ఇందులో చాలామంది పెట్టుబడులు, అవసరాలకు కావలసిన డబ్బు కోసం డైలీ ఫైనాన్షియర్లను ఆశ్రయిస్తున్నారు. ఇటువంటి వారి అవసరాలను వ్యాపారులు ‘క్యాష్’ చేసుకుంటున్నారు. ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో వ్యాపారులు ఫైనాన్షియర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇక్కడ రోజు వారీ నుంచి వారం, నెల, 50 రోజులు, 100 రోజుల కాల పరిమితితో ఫైనాన్షియర్లు అప్పు ఇస్తుంటారు. నూటికి రూ.10 నుంచి రూ.20 వరకు డిమాండ్‌ను బట్టి వడ్డీ వసూలు చేస్తున్నారు. రొటేషన్ అవుతున్న వారు చెల్లింపులు చేస్తున్నారు. వ్యాపార లావాదేవీలు నామమాత్రంగా జరిగేవారు కంతులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. చెల్లింపులు ఆలస్యమైతే ఫైనాన్షియర్ల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు పెరుగుతాయి. కొందరు ఒత్తిళ్లు తట్టుకోలేక వేదనకు గురవుతున్నారు.

తాకట్టు రుణాలది మరీ ఘోరం..

హిందూపురంలో ద్విచక్ర వాహనాలు మొదలు, నాలుగు చక్రాల వాహనాలు తాకట్టు పెట్టుకొని అప్పు ఇచ్చే ఫైనాన్షియర్లు 20 మంది వరకు ఉన్నారు. వీరు వాహనాలను కుదువ పెట్టుకుని అప్పులు ఇవ్వడం.. సకాలంలో చెల్లించకపోతే వాహనాలను అయినకాటికి అమ్మి రికవరీ చేసుకోవడం పరిపాటిగా చేస్తున్నారు. జల్సాలకు అలవాటుపడిన కొందరు తమవద్దనున్న సెల్‌ఫోన్లను తాకట్టు పెట్టి వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తీసుకుంటున్నారు. తర్వాత వారు చెప్పినంత వడ్డీ కడితేనే సెల్‌ఫోన్లు వెనక్కు ఇస్తున్నారు.

వ్యసన పరులూ.. విలవిల!

కూటమి పాలనలో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. బెల్టుషాపులు సైతం భారీగా వెలిశాయి. మద్యానికి అలవాటుపడ్డ వారు దుకాణాల వద్దకు క్యూ కడుతున్నారు. వీరితో పాటు ఇతర వ్యసనాలకు బానిసైన వారు చేతిలో డబ్బు లేకపోతే వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇలా పట్టణంలో రూ.10 కోట్లకు పైగా వడ్డీ వ్యాపారం నడుస్తోంది. ఇదంతా అనధికారిక లావాదేవీలే.

శ్రుతిమించుతున్న ఆగడాలు..

వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. వడ్డీలకు తీసుకొన్న వారు సకాలంలో చెల్లించకపోతే సెక్యూరిటీగా పెట్టిన ఆస్తులు స్వాధీనం చేసుకుని, అమ్మి రికవరీ చేసుకుంటున్నారు. అప్పుల ముసుగులో వడ్డీ వ్యాపారులు జలగల్లా పీడిస్తున్నా.. బాధితులు బయటకు చెప్పుకోలేక మిన్నకుండిపోతున్నారు. అనధికారికంగా సాగుతున్న వడ్డీ వ్యాపారుల ఆగడాలకు అధికారులు కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది.

నేరాల నియంత్రణకు డ్రోన్‌తో నిఘా

తనకల్లు/ కదిరిటౌన్/ ఎన్‌పీకుంట/ గాండ్లపెంట: నేరాల నియంత్రణకు డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. శనివారం కదిరి నియోజకవర్గంలో ఎస్పీ పర్యటించారు. తనకల్లు పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ శివనారాయణస్వామితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డ్రోన్లు ఏర్పాటు చేసి తద్వారా నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణా అరికడతామన్నారు. మహిళలు, బాలికలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను, పాత పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. అంతకుముందు ఎస్‌ఐ గోపీ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కదిరి రూరల్ సీఐ నాగేంద్ర పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన..

పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ఎస్పీ రత్న సూచించారు. శనివారం కదిరి మున్సిపల్ పరిధిలోని నిజాంవలి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, యువత పెడదారి పట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. మట్కా, పేకాట, గంజాయి అక్రమరవాణా తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, సీఐ వి.నారాయణరెడ్డి, ఎస్‌ఐ బాబ్జాన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

స్నేహభావంతో మెలగాలి..

ఎన్‌పీకుంట పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రత్న శనివారం తనిఖీ చేశారు. అనంతరం సమస్యాత్మక గ్రామాలు, కేసుల గురించి ఎస్‌ఐ వలిబాషాతో చర్చించారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల పట్ల స్నేహభావంతో మెలగాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం సచివాలయ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి.. బాల్యవివాహాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐలు నరసింహుడు, మక్బూల్‌బాషా, ఏఎస్‌ఐ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేమన సమాధిని దర్శించుకున్న ఎస్పీ..

గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని విశ్వకవి యోగివేమన సమాధిని ఎస్పీ రత్న శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతులు ఎస్పీని ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో గోడలపై చెక్కిన వేమన శతకాలను క్షుణ్ణంగా పరిశీలించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీ ఆలయం



దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

ఖాద్రీ ఆలయంలో ధన్మురాస శోభ

కదిరి టౌన్: నవ నారసింహుని క్షేత్రాల్లో కెల్లా భక్త ప్రహ్లాద సమేత స్వయంభుగా వెలసింది శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం. శుభకరమైన ధనుర్మాస, మార్గశిర మాసం చివరి శనివారం పవిత్ర శని త్రయోదశి అనూరాధ నక్షత్రం రోజు శ్రీఖాద్రీ నృసింహుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగ తెగిపడి పాడి గేదెల మృతి



మృతి చెందిన పాడి గేదెలు

మడకశిరరూరల్: సిద్దగిరి గ్రామ సమీపంలో శనివారం 11 కేవీ విద్యుత్ వైరు తెగి పడి రెండు పాడి గేదెలు మృతి చెందాయి. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి తన గేదెలను మేతకోసం తోలుకెళ్లాడు. గేదలు మేత మేస్తుండగా ఒక్కసారిగా 11 కేవీ విద్యుత్ వైరు తెగి వాటి మీద పడింది. దీంతో రెండు గేదెలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాయి. 50 మీటర్ల వరకూ విద్యుత్ తీగ కాలిపోయింది. ఘటనలో రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ ఏఈ విశ్వనాథ్, లైన్‌మ్యాన్ బాలకృష్ణ ఘటన స్థలంతో పాటు మృతి చెందిన గేదెలను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి పరిహారం కోసం ఉన్నత అధికారులకు నివేదక పంపుతామని తెలిపారు. సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఎందుకు బ్రేక్ డౌన్ కాలేదని ఆరా తీశారు.

కంటి వైద్యశిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం కేశాపురంలో శనివారం గ్రామానికి చెందిన దివంగత హింది పండిట్ మొర్రెడ్డి గారి నాగిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆదిశేషారెడ్డి(ఎన్ఆర్ఐ), పురుషోత్తమరెడ్డి ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రముఖ శాస్త్రవేత్త అమెరికా చెన్నారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న పేదల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఇక్కడే ఆపరేషన్లు చేసేందుకు బస్సులో పరికరాలు ఏర్పాటు చేశామని ఆదిశేషారెడ్డి తెలిపారు. వారం రోజులపాటు వైద్య సేవలు కొనసాగుతాయన్నారు. కంటి పరీక్షలు చేయించుకునే వారికి అల్పాహారంతోపాటు భోజనం అందిస్తామని తెలిపారు. అనంతరం చెన్నైకి చెందిన శంకర నేత్రాలయం కంటి వైద్య నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరం ఏర్పాటు చేసిన ఆదిశేషారెడ్డి సోదరులకు సర్పంచ్ నరేంద్రరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్లు అలెక్స్, దివ్య, షానికా, రంజిత్ కుమార్, పాఠశాల హెచ్ఎం రియాజ్, విశ్రాంత ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భళా.. అంజినప్ప కళ!

భుజాన మాసిన నల్లటి గొంగళి, తైల సంస్కారం లేని జుట్టు..నుదుటిపై నల్లని గుడ్డ పీలికతో కట్టిన కట్టు, కళ్లలో దైన్యం, శూన్యంలోకి చూపులు, మాసిన గడ్డం, ఆ గడ్డం కింద కర్ర, భుజంపై కుండ, విచారవదనం, కనుబొమ్మలు చిట్లించి మోమును కన్నీటి సాగరమున ముంచి లేపే అభినయం, స్పష్టమైన పద ఉచ్చారణ, గంభీరమైన గాత్రం, పాత్రకు తగ్గ అభినయం.గద్గద స్వరంలో హెచ్చుతగ్గులను సమ్మిళితం చేస్తూ గుండెల్ని పిండేసే ఆలాపన శేషయ్యగారిపల్లి అంజినప్ప సొంతం. ఆయన నోటి వెంట జాషువా పద్యాలు సెలయేరులా జాలువారుతుంటే రంగస్థల కళాభిమానుల సంతోషం మాటల్లో వర్ణించలేం..

- చిత్రకారుడిగా...రంగస్థల కళాకారుడిగా ఉపాధ్యాయుడి ప్రతిభ
- పేద కళాకారులకు చేయూతనిస్తున్న వైనం
- వరించిన ఎన్నో అవార్డులు, ప్రశంసలు



సత్య హరిశ్చంద్రుడి పాత్రలో ఉపాధ్యాయుడు అంజినప్ప



మాజీ ప్రొఫెసర్ చిగిచెర్ల కృష్ణారెడ్డితో అంజినప్ప(ఫైల్)



అంజినప్ప కుంచె నుంచి జాలువారిన ఛత్రపతి శివాజీ చిత్రం

ధర్మవరం రూరల్: ఒకవైపు ఉపాధ్యాయ వృత్తి..మరోవైపు రంగస్థలం, చిత్రకళలపై మక్కువ. రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగుతున్నారు అంజినప్ప. పుట్టపర్తి మండలంలో మారుమూల అటవీ ప్రాంతమైన గంగిరెడ్డిపల్లిలో వీరప్ప, చిన్ననాగమ్మ దంపతులకు నలుగురి సంతానంలో పెద్దకుమారుడే శేషయ్యగారిపల్లి అంజినప్ప. వృక్ష శాస్త్రంలో పీజీ చేసి డీఎడ్, బీఈడీ పూర్తి చేశారు. 2008 నుంచి 2011 వరకు ఆర్టీటీ టీచర్‌గా, విద్యా వలంటీర్‌గా సొంత ఊరిలోనే పనిచేశారు. క్విజ్ పోటీలు, కళలకు సంబంధించిన పోటీలు, బయలు నాటకాలు, కోలాటం తదితర కళా ప్రదర్శనలంటే ఆసక్తి ఎక్కువ. ఇదే ఆయనను కళాకారుడిగా మార్చింది. పాతాన్ని సైతం రాగయుక్తంగా వివరించేవారు. సత్యహరిశ్చంద్ర నాటకాన్ని జిల్లాలోనే కాదు కర్ణాటక, తమిళనాడులో ప్రదర్శన ఇచ్చినా అతనే హరిశ్చంద్రుడిగా వేషం కట్టి రక్తి కట్టిస్తారు. రంగ స్థలమే కాకుండా చిత్రలేఖనంలోనూ దిట్ట. కంటితో చూసిన దేనినైనా తన కుంచెతో అద్భుతంగా చిత్రీకరిస్తారు. చిత్ర కారుడిగా ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన నాగలూరు వద్ద ఉన్న రూపారాజ పీసీఎంఆర్ పాఠశాలలో బయాలజీ ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు.

జానపద కళారత్న కృష్ణారెడ్డితో కళాభిషేకం

ఆంధ్ర యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ చిగిచెర్ల కృష్ణారెడ్డితో ఇటీవల కళాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం మండలం సుబ్బరావుపేటకు చెందిన ప్రొఫెసర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి జానపద కళలకు ప్రాణం పోశారు. అందులో భాగంగా కీలుగుర్రాలు, చెక్కభజనలు, మరగాళ్ల తదితర వాటిని సుబ్బరావుపేట, అప్రాచెరువు గ్రామాలకు చెందిన వారికి నేర్పించి ఎంతో మందిని ఆయన కళాకారులుగా తీర్చిదిద్దారు. అలాంటి జానపద పరిశోధకులు, జానపద కళారత్న, జానపద నృత్య చక్రవర్తి, ఆంధ్రా యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్‌తో కళాభిషేకాన్ని అంజినప్ప నిర్వహించారు.

తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలు

తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అంజినప్ప దాతల సహకారంతో గ్రామీణ ప్రాంతంలో ఉండే పేద కళాకారులకు(మట్టిలో మాణిక్యాల లాంటి వారిని గుర్తించి) ఆర్థిక సాయం అందించి వారిని ముందుకు తీసుకొస్తున్నారు.

వేదిక్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్



సాహిత్యాన్ని భద్ర పరచడమే గాక పది మందికి పంచాలనే తపనతో స్నేహితులు, శిష్యుల కోరిక మేరకు తేనె తెలుగు పేరుతో అంజినప్ప యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు. అంతరించిపోతున్న కళారూపాలకు జీవం పోయాలనే లక్ష్యంతో కళాకారులను గుర్తించి 2021లో కళాభిషేకం పేరుతో కార్యక్రమాన్ని చిత్రీకరించి యూట్యూబ్‌లో ఉంచారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ కళాకారులు 200 మందికి పైగా ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహించడమే కాక వారిని సన్మానించారు. వారి ప్రతిభను ప్రపంచానికి చూపించారు. అంజినప్ప సాగిస్తున్న కళాసేవను గుర్తించి కళాప్రేమి అవార్డుతో రాయలసీమ కోఆర్డినేషన్ వారు సత్కరించారు. విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకులు అక్కినేని నాగేశ్వరరావు అవార్డు ప్రదానం చేశారు. ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





తీవ్రంగా గాయపడిన ఆదర్శ్, వడ్డే రామాంజనేయులు

బత్తలపల్లి: మండల కేంద్రంలో శనివారంరెండు ద్విచక్రవాహనాలు ఢీ కొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన సమాచారం మేరకు.. ధర్మవరానికి చెందిన అన్నదమ్ములు ఆదర్శ్, ఆదిత్యనారాయణ తాడిపత్రి సమీపంలోని ఆలూరు కోన రంగనాయకులు ఆలయంలో బంధువుల కేశ ఖండన కార్యక్రమానికి బైక్‌పై వెళ్లి తిరుగుపయనమయ్యారు. బత్తలపల్లి వద్ద ధర్మవరం రోడ్డుకు గల మద్యం దుకాణం సమీపంలోకి రాగానే బత్తలపల్లికి చెందిన వడ్డే రామాంజనేయులు తన టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంలో రోడ్డును క్రాస్ చేస్తుండగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆదర్శ్, రామాంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. ఆదిత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆటోలో బత్తలపల్లి ఆర్టీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు



వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఐఓ నాగేంద్ర నాయక్

తలుపుల: గర్భిణులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ నాగేంద్రనాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం బట్రేపల్లి రోడ్డులోని గుడారాల్లో నివాసం ఉంటున్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న సీఐ జనార్దన్

లేపాక్షి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ పేర్కొన్నారు. లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో శనివారం వార్షిక క్రీడోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. క్రమశిక్షణ, సత్ప్రవర్తన, కష్టపడి పనిచేసే తత్వంతో ఉన్నతస్థానాలకు ఎదగొచ్చన్నారు. ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలోని సౌకర్యాలు వినియోగించుకుని మంచిస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల పూర్వ విద్యార్థి సందీప్ క్రీడలను ప్రారంభించడమే కాకుండా వంద మీటర్ల పరుగు పందెంలో పిల్లలతో పాటు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు. ఎస్ఐ నరేంద్ర,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం శివలింగం తొలగింపు



కుందుర్పి: నరసంపల్లి సమీపంలోని పురాతన శివాలయంలో గుప్త నిధుల కోసం శివలింగం, నంది విగ్రహాన్ని తొలగించారు. వివరాలు.. కుందుర్పి–అల్లాపురం మార్గంలో పురాతన శివాలయం ఉంది. ఏడాది క్రితం వరకూ అర్చకుడు చంద్రప్ప అక్కడే నివాసమండేవారు. అక్కడ సౌకర్యాల లేమితో కుందుర్పికి మకాం మార్చాడు. దీంతో ఆలయం వద్ద జనసంచారం లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి గుప్తనిధుల కోసం శివలింగం, నంది విగ్రహాలను పక్కకు తోసేసి 4 మీటర్లు లోతు వరకు తవ్వకాలు జరిపారు. ఇదిలా ఉండగా 2నెలల క్రితం మలయనూరు పంచలింగాల ఆలయం, ఇటీవల ఎనుములదొడ్డి శివాలయాల్లోనూ ఇలాగే తవ్వకాలు జరిపారు. ఇప్పటికైనా పోలీసులు గుప్తనిధుల తవ్వకాలపై నిఘా పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మామిడిలో సస్యరక్షణ అవసరం

- ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్



అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కురిసిన వర్షాలు, నెలకొన్న వాతావరణ పరిస్థితులు కారణంగా పూత వచ్చే కీలకదశలో ఉన్న మామిడితోటల మంచి దిగుబడులు రావాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేసుకోవాలని సత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ సూచించారు. పూత, మొగ్గలు తొందరగా, ఒకేసారి రావాలంటే 7 గ్రాములు 13–0–45 + 2 నుంచి 3 గ్రాములు ఏదైనా సూక్ష్మధాతువు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఇదివరకే ఈ మందు పిచికారీ చేసిన రైతులు 3 గ్రాములు 0–0–50 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తేనే మంచు పురుగు ఉన్నట్లు గమనిస్తే 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల బూడిద తెగులు సోకే అవకాశం ఉందన్నారు. వర్షాలు ఆగిపోవడం, చలి వాతావరణం వల్ల పూమొగ్గలపై మంచు ఏర్పడి పూత నల్లగా మారి పిందె ఏర్పడకుండా రాలిపోయే పరిస్థితి ఉంటుందని తెలిపారు. నివారణకు 2 మి.లీ హెక్సాకొనజోల్ లేదా 1 గ్రాము థయోమిథాక్సామ్ + 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. జనవరి మొదటి వారం వరకు పూమొగ్గలు రాకుంటే ఒకసారి తేలికపాటి నీటి తడి ఇవ్వాలన్నారు. డ్రిప్ సదుపాయం ఉన్న తోటలకు 0–0–50 నీటిలో కరిగే ఎరువును 2.50 కిలోల నుంచి 3 కిలోలు ఎకరాకు డ్రిప్ ద్వారా వదులుకోవాలని సూచించారు. కీలకదశలో ఉన్న మామిడిలో మంచి దిగుబడుల కోసం రైతులు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ధర్మవరం రూరల్: బడన్నపల్లి సమీపంలో శనివారం రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 68 ఏళ వయసుం టుందని, మృతుడు ఎరుపు, బ్లూ కలర్ కలిగిన చొక్కాతో పాటు బ్లూ, తెలుపు రంగుతో లుంగీ, ఎరువు రంగు టవల్ ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 9440627640 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం మత్తులో ఇంటి పైనుంచి పడి వ్యక్తి మృతి



కంబగిరి (ఫైల్)

తాడిపత్రి టౌన్: పట్టణంలోని పోరాటకాలనీలో మద్యం మత్తులో ఇంటి పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..పోరాటకాలనీకి చెందిన కంబగిరి(40) ఉదయం మూత్ర విసర్జన కోసం ఇంటిపైకి వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న అతడు ప్రమాదవశాత్తూ పై నుంచి కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య హేమావతి, పిల్లలు రక్షిత, కార్తీక్ ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆధునిక వ్యవసాయం లాభదాయకం

- ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య



ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు, రైతులు

పుట్టపర్తి అర్బన్: ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. శనివారం జగరాజుపల్లిలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా స్థానిక ఆర్ఎస్‌కే వద్ద రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేయకపోతే తినడానికి తిండి దొరకని పరిస్థితి వస్తుందన్నారు. ప్రస్తుతం రైతులు వ్యవసాయంలో నూతన వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. రైతులు సాంకేతికత, యంత్రాలను విరివిగా వినియోగించాలన్నారు. రైతుల కష్టాలను తెలుసుకొని వారికి అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని వ్యవసాయ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఏర్పాటు చేసి ప్రదర్శనను తిలకించారు. డాక్టర్ జ్యోత్స్న, ఎన్ఎస్ఎస్ స్పెషలాఫీసర్ డాక్టర్ రమణమూర్తి, తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, పెడపల్లి, జగరాజుపల్లి, కొట్లపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వాస్పత్రిని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులకు హాజరవుతున్నారా లేదా, దీర్ఘకాలిక సెలవులో ఉన్నవారు ఎంతమంది అని ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. రోజూ ఓపీకి ఎంత మంది వస్తున్నారు, ఫార్మసీలో మందుల స్టాకు ఉందా లేదా, ఓపీకి వచ్చే రోగులకు వైద్యం చేసేందుకు సరిపడా వైద్యులు, నర్సులు ఉన్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం వార్డుల్లో ఉన్న రోగులతో మాట్లాడారు. సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా. మందులు సక్రమంగా ఇస్తున్నారా లేదా, సిబ్బంది, వైద్యుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉదయ్‌భాస్కర్, వైద్యులు నజీర్, హరి, శ్రీనివాస్, ఏఓ వాసుప్రకాష్, విజిలెన్స్ సీఐ జమీర్‌బాషా ఉన్నారు.

ఆర్ఎస్‌కే ద్వారా రాగుల కొనుగోలు



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

సోమందేపల్లి: రైతులు పండించిన రాగి పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని జేసీ అభిషేక్ కుమార్ తెలిపారు. శనివారం నల్లగొండ్రాయనపల్లిలో రాగిపంట సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులు వేరుశగనతోపాటు రాగి పంట సాగుకు మక్కువ చూపాలన్నారు. మద్దతు ధర రూ.4,290 ఇవ్వడంతో పాటు రాగుల సేకరణకు ఉచితంగా గోనె సంచులు, రవాణా ఖర్చులుప్రభుత్వమే భరిస్తుందన్నారు. తద్వారా దళారుల మోసాల బారి నుంచి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, సివిల్ సప్లయిస్ డీఎం అశ్వర్థ నారాయణ, ఏడీ స్వయం ప్రభ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్, ఏఓ కవితా రాణి, తదితరులు పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మొద్దు



దేహదారుఢ్య పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనంతపురం ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారుల మాటలు నమ్మవద్దని జిల్లా ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. శనివారం ఆయన పీటీసీ మైదానంలో ఈనెల 30 నుంచి జనవరి 17 వరకూ జరిగే పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టమన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుండడంతో ఎక్కడా అక్రమాలకు తావుండదనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను ఎవరైనా మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉదయం 5 గంటలకే హాజరుకావాలి..

ఈ నెల 30 నుంచి జనవరి 17వ తేదీ వరకు జరిగే దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 5 గంటలకు నీలం సంజీవరెడ్డి మైదానంలో హాజరుకావాలి. తమతో పాటు అడ్మిట్ కార్డు, స్టేజ్ –1, స్టేజ్–2 అప్లికేషన్ కాపీలు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకరావడంతో పాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తమ వెంట తెచ్చుకోవాలి. ఈవెంట్స్ ఉన్న అభ్యర్థులు ఆయా నిర్దేశిత తేదీలో అనంతపురం పీటీసీ తూర్పు గేటు నుంచి ప్రవేశించాలి.

- అభ్యర్థులతో పాటు తమ వెంట ఎవరైనా వచ్చినా..పీటీసీ తూర్పున ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ప్రారంభమయ్యే పాయింట్ వద్ద ఆగిపోవాలి. ఈవెంట్స్ జరిగే ప్రదేశానికి అనుమతి ఉండదు. అభ్యర్థికి మాత్రమే ఈవెంట్స్ ప్రదేశానికి రావాల్సి ఉంటుంది.

ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి..

- ఈ నెల 30వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి జనవరి 17వ తేదీ వరకు పీటీసీ తూర్పున ఉన్న రైల్వే ట్రాక్‌కు అనుకుని ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ఎలాంటి రాకపోకలు ఉండవు. ఈవెంట్స్ ముగిసే వరకు జరిగే అన్ని రోజుల్లోనూ పోలీసులు ఈ ఆంక్షలు అమలు చేస్తారు.
- రాంనగర్, లక్ష్మి నగర్ మిట్టల మీదుగా మొదటి, రెండు, మూడు తదితర రోడ్లకు వెళ్లే వాహనదారులు లక్ష్మీ నగర్ నాగులకట్ట నుంచి సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్, జన్మభూమి రోడ్డు మీదుగా వెళ్లాలి.
- మొదటి, రెండు, మూడు, తదితర రోడ్ల నుంచి రాంనగర్, లక్ష్మినగర్, రహమత్ నగర్ రైల్వే బ్రిడ్జి వైపు వెళ్లే వాహనదారులు పీటీసీ ఉత్తరం వైపు ఉన్న సర్వీసు రోడ్డు ద్వారా నడిమివంక, జన్మభూమి రోడ్డు, సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్‌మీదుగా లక్ష్మీనగర్ నాగులకట్ట నుంచి వెళ్లాలి.